సాక్షి బాపట్ల

బుధవారం, 30, అక్టోబర్, 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 50915 క్యూసెక్కులు వచ్చిచేరుతుంది. దిగువకు 44274 క్యూసెక్కులు వదిలారు.



విద్యార్థులకు పతకాలు

కర్లపాలెం: చింతాయపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. వారిని పాఠశాల హెచ్‌ఎం టి.వెంకటరాజు, పీడీ ఎం.గోపి అభినందించారు.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన ప్రతిపాటి ఆరుష్ వెంకట్ కుటుంబం రూ.1,00,116 విరాళం అందజేసింది.

న్యూస్‌రీల్

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల



బాపట్ల: సంక్షిప్త సవరణ ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్. సత్తిబాబు విడుదల చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో ముసాయిదా ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆయన విడుదల చేశారు. అనంతరం ప్రతులను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాలను కలెక్టరేట్, అసెంబ్లీ నియోజకవర్గం ఈ–ఆర్వో కార్యాలయాలలో ప్రదర్శిస్తామని, అందరూ పరిశీలించుకోవచ్చని వివరించారు. అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు. నమోదైన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఓటు హక్కు లేని పక్షంలో బుధవారం నుంచి నవంబర్ 28వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం ఇన్‌చార్జ్ పర్యవేక్షకులు షేక్ షఫీ, రాజకీయ పార్టీల నాయకులు రామకృష్ణ, కోటేశ్వరరావు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

చీరాల మున్సిపల్ కమిషనర్‌కు అవార్డు



చీరాల: ప్రధానమంత్రి ఆత్మ నిర్భర్ నిధి ద్వారా 2023–24 సంవత్సరంలో చీరాల మున్సిపాలిటీ పరిధిలో అత్యధికంగా చిరు వ్యాపారులకు రుణాలు అందించినందుకు చీరాల మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో అవార్డును కైవసం చేసుకుంది. మెప్మా కార్యాలయంలో రుణం కోసం 4,768 మంది వీధి వ్యాపారులు దరఖాస్తు చేసుకోగా 3,846 మందికి బ్యాంకుల ద్వారా రుణాలు అందించామన్నారు. ఈ సందర్భంగా మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో పీఎం స్వనిధి ద్వారా రుణాలు బాగా మంజూరు చేసినందుకు గాను మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, మెప్మా ఎండీ ఎస్.తేజ్ భరత్ చేతుల మీదగా మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ అవార్డును అందుకున్నారు.

యార్డుకు 43,346 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 43,346 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 41,651 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,200 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 15,700 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 30,279 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

బాణసంచా దుకాణాల లక్కీడ్రాలో టీడీపీ నేత

నిబంధనలు ఉల్లంఘించిన అధికారులు



బాపట్లటౌన్: దీపావళి పండగ సందర్భంగా బాణసంచా దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న 35 మంది దరఖాస్తుదారులకు పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో మంగళవారం లక్కీడ్రా తీశారు. మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, ఫైర్ అధికారుల సమక్షంలో లక్కీడ్రా తీయాల్సి ఉండగా అధికారులు పాలకుల మెప్పు కోసం టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లక్కీడ్రా తీశారు. మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, సీఐ, ఫైర్ అధికారులు ఉన్న వేదికపై టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆశీనులు కావడంతో ఇది టీడీపీ మీటింగా.. దీపావళి షాపుల లక్కీడ్రానా అంటూ కొందరు దరఖాస్తుదారులు అధికారుల తీరుపై విమర్శలు గుప్పించారు.

సంసారం ఓ చధరంగం



- పండగవేళ సామాన్యులకు మంట
- నింగికెగసిన నిత్యావసర నరుకులు
- చుక్కల్లో కూరగాయల రేట్లు
- పిండివంటల సంగతి దేవుడెరుగు
- పచ్చడి మెతుకులకూ కరువే
- కూటమి ప్రభుత్వం దీపావళి కానుక

వేటపాలెం: 'తాను అధికారంలోకి వస్తే నిత్యావసరాల ధరలు తగ్గిస్తా. కరెంటు బిల్లులు అసలు పెంచను' అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక తెప్పతగలేశారు. ఫలితంగా ధరలు అమాంతం పెరిగిపోయాయి. పేద, మధ్య తరగతి ప్రజల జీవనం రోజురోజుకూ దుర్భరంగా మారుతోంది. దీపావళి పండగనాడు పేదలు పచ్చడి మెతుకులూ తినలేని దుస్థితి నెలకొందంటే అతిశయోక్తి కాదు. రెండు నెలల నుంచి మార్కెట్‌లో నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. బియ్యం, కూరగాయల ధరలైతే తారాజువ్వల్లా నింగిని తాకుతున్నాయి. సన్‌ఫ్లవర్, పామాయిల్ నూనె ధరలు పైకి ఎగబాకాయి. కందిపప్పు, కొబ్బరి, వెల్లుల్లి, ధరలు దాదాపుగా రెట్టింపయ్యాయి. సన్‌ఫ్లవర్ అయిల్ 15 లీటర్ల డబ్బా రెండు నెలల కిందట రూ.1,600 ఉండగా, ప్రస్తుతం రూ. 2 వేలుగా ఉంది. దీంతో ప్రజలు ఏం కొనాలి, ఏం తినాలి అంటూ పెదవి విరుస్తున్నారు. ధరలు తగ్గిస్తామన్న చంద్రబాబు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్కారుకు ఓటెందుకు వేశామా అని బాధపడుతున్నారు.

బియ్యం ధరలకు రెక్కలు

ఓ వైపు నిత్యావసరాలతోపాటు బియ్యం ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో సన్న బియ్యం కిలో రూ.72 పైమాటే, సూపర్ మార్కెట్‌లో కేజీ బియ్యం రూ.100కు చేరింది. మార్కెట్‌లో బియ్యం ధరలు పెరుగుతుండటంతో కొందరు రేషన్ బియ్యం రీ సైక్లింగ్ చేసి వినియోగదారులకు అంటగడుతున్నారు.

నిత్యావసర ధరలు ఇలా(కిలోకి రూపాయల్లో)..

వస్తువు	10 రోజుల కిందట	ప్రస్తుతం
సన్నరకం బియ్యం	60	70
పామాయిల్ లీటర్	90	130
సన్‌ఫ్లవర్ అయిల్ లీటర్	115	160
గోధుమ పిండి	40	45
చింతపండు	120	180
వెల్లుల్లి	200	400
కందిపప్పు	170	180
ఎండుకొబ్బరి కిలో	140	210
శనగపప్పు	90	130
బెల్లం	40	60
టెంకాయ ఒకటి	25	35

ప్రస్తుతం మార్కెట్‌లో కాయకూరలు ధరలు (కిలోకు రూపాయల్లో)..

కూరగాయ	ధర
పెద్ద చిక్కుడు	200
పచ్చి మిర్చి	100
బీరకాయ	100
కాకరకాయ	80
టమాట	80
క్యారెట్	100
వంకాయ	80
బెండకాయ	80
ఆలుగడ్డ	90
బీట్‌రూట్	90
క్యాలీఫ్లవర్ (ఒకటి)	60
క్యాబేజీ	80
చేమదుంప	70
దోసకాయ	80
తోటకూర (కట్ట)	20
గోంగూర (కట్ట)	20

కోతలకే పరిమితమైన కూటమి ప్రభుత్వం..

గత ప్రభుత్వం రేషన్ కార్డు ద్వారా బియ్యంతో పాటు, చక్కెర, కంది పప్పు, గోధుమ పిండి పంపిణీ చేసేది. నిత్యావసర సరుకులు ఇంటింటికీ సరఫరా అయ్యేవి. అయితే కూటమి ప్రభుత్వం కార్డుదారులకు కేవలం బియ్యంతో సరిపెడుతోంది. ఈ ప్రభుత్వం కేవలం కోతలకే పరిమితమైందంటూ ప్రజలు విమర్శిస్తున్నారు.

కాయగూరలు కొనలేకపోతున్నాం

ప్రస్తుతం కాయగూరల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కొనలేక పోతున్నాం. కొద్దికొద్దిగా కూరలు కొనుక్కొని కాలం వెళ్లదీస్తున్నాం. పచ్చడి మెతుకులతో కాలం గడుపుతున్నాం.

– డి.వసుంధరదేవి, వేటపాలెం

ధరలు బాగా పెరిగాయి.

ఏం తినాలో అర్థం కావడం లేదు. అన్ని రేట్లూ పెరిగిపోయాయి. కోడి గుడ్లు, చికెన్ ధరలు విపరీతంగా పెరిగాయి. నిత్యావసరాల ధరలూ పెరిగాయి. చేసేది లేక ప్రస్తుతం ఆకుకూరలు, పచ్చడి మెతుకులతో కాలం వెళ్లదీస్తున్నాం. కాయగూరల ధరలు రెండు నెలల పాటు తగ్గే పరిస్థితి లేదని వ్యాపారులు చెబుతున్నారు.

– అంజమ్మ, వేటపాలెం

సమర్థంగా నీటి సంఘాల ఎన్నికలు

కలెక్టర్ వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల: నీటి సంఘాల ఎన్నికలు నవంబర్ 20న సమర్థంగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. ఆర్డీఓలు, తహసీల్దార్లతో స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించిందని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో 92 నీటి సంఘాలు ఉండగా, వాటి పరిధిలో మరో 114 టీసీ (టెరిటోరియల్ కానిస్టెన్సీ) కాల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. వాటి పరిధిలోని నీటి తీరువా చెల్లింపుదారులందరికీ ఓటు హక్కు ఉందన్నారు. నవంబర్ ఆరో తేదీ నుంచి 10వ తేదీలోగా ఓటు హక్కు దరఖాస్తుల నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆ వెంటనే ఓటర్ల జాబితా పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని, నవంబర్ 13న సాగునీటి సంఘాల ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామన్నారు. నవంబర్ 20న ఎన్నికలు ఉంటాయని, సమర్థంగా నిర్వహించడానికి అధికారులు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

గ్రాడ్యుయేట్ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

గుంటూరు పరిధిలోని శాసన మండలి గ్రాడ్యుయేట్ స్థానానికి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్ల నమోదు వేగంగా చేపట్టాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. నవంబర్ ఆరో తేదీతో దరఖాస్తుల స్వీకరణ ముగుస్తుందని వెల్లడించారు. గత ఎన్నికల సమయంలో 18 వేల మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని, అయినా వారంతా మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా ప్రస్తుతం ఎనిమిది వేల దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. మిగిలిన ఓటర్లంతా తమ ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. నవంబర్ 23న గ్రాడ్యుయేట్ ఎన్నికలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలవుతుందన్నారు. డిసెంబర్ 9లోగా అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని, సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితాలో పేర్లు లేకపోతే నవంబర్ 28లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నవంబర్ 9, 10 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు పోలింగ్ బూత్‌లలో జరుగుతాయన్నారు. 2025 జనవరి 6న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నారు. ఇందుకోసం ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలు సవ్యంగా చేపట్టాలన్నారు.

ఎస్టీలు ఆధార్ కార్డుల కోసం నమోదు చేసుకోవాలి

ఎస్టీలందరికీ ఆధార్ కార్డులు ఇవ్వాలని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. ఆధార్ కార్డులు లేని ఎస్టీలు 3,299 మంది ఉన్నట్లు సర్వేలో గుర్తించామని, ఈనెల 25వ తేదీ నాటికి 89 మందికి కార్డులు ఇప్పించామని వివరించారు. మిగిలిన వారికి తక్షణమే కార్డులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాపట్ల జిల్లాలోని ఇనాం భూముల సమస్యను పరిష్కరించాలని వెల్లడించారు. చీరాల, మార్టూరు, సంతమాగులూరు, పర్చూరు, బల్లికురవ మండలాలలోని ఇనాం భూముల సర్వే ప్రక్రియ త్వరగా ముగించాలని, రైతు వారి పట్టాలు ఇవ్వడానికి తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో భగ్గు

- ఎంపీ, ఎమ్మెల్యే మధ్య ఆధిపత్యపోరు
- టీడీపీ అధిష్టానం వద్దకు పంచాయితీ
- ప్రొటోకాల్ పాటించడం లేదంటున్న ఎంపీ
- జిల్లా కేంద్రంలో తానే బాస్ అంటున్న ఎమ్మెల్యే
- అధికారుల బదిలీలకు పోటాపోటీగా సిఫార్సు లేఖలు
- ఎంపీ లేఖలకు ప్రాధాన్యం ఇవ్వవద్దంటున్న ఎమ్మెల్యే
- మద్యం షాపులు ఏర్పాటులోనూ సై అన్న ఇరువర్గాలు



సాక్షి ప్రతినిధి, బాపట్ల: అధికార తెలుగుదేశం పార్టీలో ఇంటి పోరు రోడ్డున పడింది. బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఫలితంగా పార్టీ రెండు వర్గాలుగా చీలింది. ఇప్పటికే ఇద్దరు నేతల అనుచరులు అధిష్టానానికి పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయం హాట్ టాపిక్‌గా మారింది. వీరి పంచాయితీ తేల్చాలని ఇన్‌చార్జ్ మంత్రి పార్థసారథి, జిల్లా మంత్రులు గొట్టిపాటి రవి, అనగాని సత్యప్రసాద్‌లకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సూచించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఆది నుంచీ విభేదాలు

ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్రవర్మల మధ్య ఆది నుంచి విభేదాలు ఉన్నాయి. కృష్ణప్రసాద్‌ను తెలంగాణ బీజేపీ నుంచి దిగుమతి చేసుకుని ఎంపీ అభ్యర్థిగా నిలపడాన్ని జిల్లాలోని దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులతోపాటు వేగేశన నరేంద్రవర్మ వ్యతిరేకించారు. ఎన్నికల సమయంలో కృష్ణప్రసాద్, ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ప్రచారం చేసేందుకూ వర్మ అంగీకరించలేదు. కృష్ణప్రసాద్ ఎంపీ అయ్యాక విభేదాలు మరింత పెరిగాయి. కొందరు అధికారుల బదిలీల కోసం ఎంపీ సిఫార్సు లేఖలు ఇవ్వగా ఎంపీలకు అధికారుల బదిలీలతో సంబంధమేమిటని ఎమ్మెల్యే గొడవకు దిగారు. ఎంపీ మాట వినవద్దని జిల్లా స్థాయి అధికారులకు అల్టిమేటం ఇచ్చారు. జిల్లా అధికారులతో ఎమ్మెల్యే సమావేశమైన ఫొటోలు బయటకు రాగానే ఎంపీ అధికారులతో రివ్యూలు పెట్టి తన ఆధిపత్యాన్ని చాటుకుంటున్నారు. ఇద్దరి పోరుతో జిల్లా అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

రోడ్డెక్కిన రియల్ గొడవ

ఒక సామాజికవర్గం వారిని టార్గెట్ చేసే ఎత్తుగడలో భాగంగా బాపట్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారులతో వర్మకు విభేదాలు పొడచూపాయి. అనధికార లేఅవుట్లంటూ పలు వెంచర్లకు ఎమ్మెల్యే నోటీసులు ఇప్పించారు. దీంతో రియల్టర్లు ఎంపీని ఆశ్రయించారు. ఆయన మంత్రులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో తన నియోజకవర్గంలో పెత్తనమేంటని ఎమ్మెల్యే ఎంపీని నిలదీశారు. దీంతో గొడవ రోడ్డెక్కింది.

మద్యం షాపుల కోసం పోటీపడి..!

మద్యం షాపుల టెండర్ల వ్యవహారంలో ఎంపీ, ఎమ్మెల్యేలు పోటీ పడి అనుచరులతో టెండర్లు వేయించారు. బాపట్ల కూరగాయల మార్కెట్ సెంటర్లో ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు పోటాపోటీగా పక్కపక్కనే మద్యం షాపులు ఏర్పాటు చేయడం వారి మధ్య విభేదాలను బయట పెట్టింది.

ఎంపీకి ఆహ్వానం ఉండట్లేదు

బాపట్ల నియోజకవర్గంలో ఏ కార్యక్రమం జరిగినా ఎమ్మెల్యే అనుచరులు ఎంపీని ఆహ్వానించడంలేదు. ఒకటి రెండు కార్యక్రమాలకు పిలిచినా ఫ్లెక్సీలలో ఎంపీ ఫొటోలు ప్రొటోకాల్‌కు విరుద్ధంగా వేస్తున్నారని ఎంపీ వర్గం మండిపడుతోంది. ఏ చిన్న తప్పు దొరికినా అధిష్టానానికి పరస్పరం ఫిర్యాదులు చేసుకొంటున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై రచ్చ

ఇసుక అక్రమ రవాణాలో ఎమ్మెల్యే వర్గం కీలకంగా ఉంది. నియోజకవర్గంలో ఒకటిరెండు చోట్ల ఎంపీ వర్గీయులు ఇసుకను తోలుకునే యత్నం చేశారు. ఎమ్మెల్యే పోలీసులకు చెప్పి ఎంపీ వర్గీయులను కట్టడి చేసినట్లు ప్రచారం ఉంది. బాపట్లలో ఎంపీ కృష్ణప్రసాద్ నివాసమున్న ప్రాంతంలో పారిశుద్ధ్య పనులూ చేపట్టవద్దని వర్మ మున్సిపల్ అధికారులను ఆదేశించినట్లు ప్రచారం జరుగుతోంది.

టీడీపీ కార్యాలయంలో అధికారులతో ప్రజాదర్బార్!

ఎమ్మెల్యే వర్మ ఇటీవల టీడీపీ జిల్లా కార్యాలయం వేదికపై అధికారులతో కలిసి ప్రజాదర్బార్ నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. కొందరు అధికారులు పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించకూడదని చెప్పినా ఆయన ఏమాత్రం ఖాతరు చేయలేదని, అధికారులు హాజరు కావాల్సిందేనని ఆదేశించారు. దీంతో అధికారులు టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో పాల్గొనాల్సి వచ్చింది. ఈ విషయాన్ని ఎంపీ వర్గం అధిష్టానానికి చేరవేసినట్లు తెలుస్తోంది.

బీచ్ సందర్శన పన్నుపై వ్యతిరేకత

తాజాగా సూర్యలంక బీచ్ సందర్శనకు తలకు రూ.20 పన్ను విధిస్తున్నట్లు ఎమ్మెల్యే నరేంద్రవర్మ ప్రకటించడం సంచలనం రేపింది. ఎన్నడూ లేని విధంగా బీచ్ సందర్శనకు పన్ను విధించడమేంటని స్వపక్షం నుంచే వ్యతిరేకత వెల్లువెత్తింది. మత్స్యకారులు, ప్రజలు దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే చర్యలతో ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను పసిగట్టిన ఎంపీ ముఖ్యమంత్రితోపాటు మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయండి

- మహిళల కేసుల దర్యాప్తుకు అధికప్రాధాన్యం ఇవ్వాలి
- నిర్మానుష్య ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాల్లో డ్రోన్లతో నిఘా పెంచాలి
- ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
- బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి
- నేర సమీక్షలో ఎస్పీ తుషార్‌డూడీ



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లాలోని బాపట్ల, రేపల్లె, చీరాల సబ్‌డివిజన్ పరిధిలోని డీఎస్పీలతో మంగళవారం నేర సమీక్ష నిర్వహించారు. తొలుత దర్యాప్తులో ఉన్న కేసులు, మహిళా సంబంధిత నేరాలు, చోరీలు, దోపిడీలపై సమీక్షించారు. ఎస్పీ తుషార్‌డూడీ మాట్లాడుతూ మహిళ సంబంధిత కేసుల విచారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. నిర్మానుష్య ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాల్లో డ్రోన్లతో నిఘా పెంచాలని ఆదేశించారు. గస్తీని మరింత ముమ్మరం చేయాలని సూచించారు. ప్రత్యేకంగా క్రైమ్ పార్టీలను ఏర్పాటు చేసి చోరీ కేసులను త్వరితగతిన ఛేదించాలని చెప్పారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. బాణసంచా దుకాణాల ఏర్పాటులో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అనుమతుల్లేని దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, చీరాల డీఎస్పీ పి.జగదీష్ నాయక్, రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆస్తి కోసం దారుణం

కన్నతండ్రిని చంపిన కుమారుడు




తోక వెంకట్రామయ్య మృతదేహం

ప్రత్తిపాడు: ఆస్తి కోసం కొడుకే కన్నతండ్రిని మంచం కోడుతో కిరాతకంగా కొట్టి హత్య చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడుకు చెందిన తోక వెంకటరామయ్య (60) స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆయన రెండు వివాహాలు చేసుకున్నాడు. మొదటి భార్యకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండవ భార్యకు సంతానం లేదు. ఈ నేపథ్యంలో మొదటి భార్య కుమారుడు వెంకటకృష్ణ ఆస్తిలో వాటా ఇవ్వాలని తండ్రిని కొంతకాలంగా వేధిస్తున్నాడు. వెంకటకృష్ణకు అతని భార్య కూడా సహకరించేది. ఇద్దరూ కలిసి వెంకటరామయ్యపై ఒత్తిడి తీసుకువచ్చారు. తనకున్న ఎనిమిది సెంట్లులో నాలుగు సెంట్లు కొడుకు, కోడలి పేరుతో ఆయన రాసిచ్చాడు. అయినప్పటికీ సంతృప్తి చెందని కుమారుడు మిగిలిన ఆస్తి కోసం గత కొంతకాలంగా తండ్రితో గొడవ పడుతున్నాడు. కొడుకు, కోడలు కలిసి వెంకటరామయ్యపై కేసులు పెట్టారు. దీంతో వెంకట్రామయ్య సొంత ఇంటిని వదిలేసి వేరే ఇంటికి వెళ్లిపోయాడు. కుమారుడు కూడా భార్య స్వగ్రామానికి వెళ్లిపోవడంతో గొడవలు సర్దుమణిగాయి. వెంకటరామయ్య తిరిగి కోండ్రుపాడులోని సొంత ఇంటికొచ్చి ఉంటున్నాడు. మంగళవారం రాత్రి అక్కడికి కుమారుడు వచ్చాడు. ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లాడు. ఇంతలో వెంకట్రామయ్య రావడంతో ఆస్తి విషయమై వాగ్వాదం చోటుచేసుకుంది. వెంకటకృష్ణ మంచం కోడు తీసుకుని తండ్రి తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ నాగేంద్ర ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

బీమా సంస్థ ఉద్యోగిపై కత్తితో దాడి

- నామినీ పేరు మార్పులో జాప్యమే కారణం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు



చికిత్స పొందుతున్న పులిగడ్డ రాజేష్

లక్ష్మీపురం: ప్రమాద బీమా పాలసీలో పేరు తప్పు పడిందని బీమా కంపెనీ ఆపరేషన్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లగా పేరు మార్చేందుకు 10 రోజులు పడుతుందని చెప్పడంతో కత్తితో దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. గాయపడిన మేనేజర్ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అరండల్‌పేట 7/1 అడ్డరోడ్డులోగల కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీకి మంగళవారం ఉదయం పెదకాకాని శివాలయం రోడ్డుకు చెందిన కందుల శ్రీనివాసరావు వచ్చారు. ఆపరేషన్స్ మేనేజర్ పులిగడ్డ రాజేష్‌ను కలిసి బీమా పాలసీలో నామినీ పేరు తప్పుగా పడిందని చెప్పారు. పేరు సరిచేసేందుకు సుమారు 10 రోజులు పడుతుందని రాజేష్ బదులిచ్చారు. దీంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. శ్రీనివాసరావు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత మళ్లీ వచ్చి రాజేష్‌తో గొడవ పడ్డారు. కంప్యూటర్, లాప్‌టాప్, ఫర్నిచర్ ధ్వంసం చేసి రాజేష్‌పై కత్తితో దాడి చేశాడు. కార్యాలయ సిబ్బంది అతడిని అడ్డుకున్నారు. గాయపడిన రాజేష్‌ను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడు చికిత్స పొందుతున్నారు. కంపెనీ మేనేజర్ సింగంశెట్టి గోపి దీనిపై అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

హ్యాండ్‌బాల్ పోటీల్లో వలపర్ల విద్యార్థుల సత్తా



మార్టూరు: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు సత్తా చాటారు. గుంటూరు జిల్లా తెనాలి డీఎస్ఏ స్టేడియంలో జరిగిన అండర్–14 పోటీల్లో పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎం. లారెన్స్, ఎం. కీర్తి పాల్గొన్నారు. వీరి జట్టు మూడో స్థానంలో నిలిచింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించి రాష్ట్రస్థాయి బహుమతి పొందిన ఆ ఇద్దరిని మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు సూర్యలంక టోల్‌గేట్ వేలంపాట

బాపట్ల టౌన్: సూర్యలంక సముద్రతీరానికి చేరుకునే వాహనాల పార్కింగ్ (టోల్‌గేట్) ఫీజు వసూలు నిమిత్తం బుధవారం తీరంలోని తుపాన్ షెల్టర్ వద్ద బహిరంగ వేలంపాట నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈవోపీఆర్‌డీ పులి శరత్‌బాబు మంగళవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ. 5 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఉదయం 10 – మధ్యాహ్నం 1 గంట వరకు డిపాజిట్ స్వీకరిస్తామని, ఆ తర్వాత నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించిన వేలంపాట ఉంటుందని తెలిపారు. తీరానికి ఏటా అక్టోబర్‌లో వేలంపాట నిర్వహిస్తారు. దక్కించుకున్న వ్యక్తులు ఏడాది వరకు ఫీజు వసూలు చేసుకుంటారు. ఎన్నడూ లేనివిధంగా కేవలం రెండు నెలలకు మాత్రమే వేలంపాట నిర్వహిస్తున్నామని అధికారులు చెప్పడంతో స్థానికులు పెదవి విరుస్తున్నారు. పంచాయతీ అధికారుల ముసుగులో దోచుకునేందుకు ప్లాన్ చేస్తున్నారా? అంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. వేలంపాటతో ఏటా రూ. 30 లక్షల వరకు పంచాయతీకి ఆదాయం వస్తోంది.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

పట్నంబజారు: కార్తిక మాసం పురస్కరించుకుని శైవ క్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం స్పెషల్ బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి కరపత్రాలను మంగళవారం ఏపీఎస్‌ఆర్టీసీ గుంటూరు రీజినల్ మేనేజర్ ఎం.రవికాంత్ ఆవిష్కరించారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని ఆర్‌ఎం చాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, అమరావతి, శ్రీశైలం, యాగంటి, మహానంది వెళ్లాలనుకునే భక్తుల కోసం ఈ బస్సులను అందుబాటులో తీసుకొస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 73828 96403, 73828 97459 ఫోను నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గుంటూరు జిల్లా వాలీబాల్ జట్లు ఎంపిక




ఎంపికైన బాలుర, బాలికల జట్లు

తెనాలి: గుంటూరు జిల్లా అండర్–19 బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపిక మంగళవారం స్థానిక జేఎంజే మహిళా కళాశాలలో నిర్వహించారు. జిల్లా కార్యదర్శి జి.నరసింహారావు, సహాయ కార్యదర్శి సీహెచ్ పద్మాకర్, కాలేజీ వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ అరుణ సుజాత, కేవీ ఖాసీం, రవీందర్, సీహెచ్ రంజిత్‌లు ఎంపిక పోటీలను జరిపారు. అనంతరం ఆయా జట్ల వివరాలను ప్రకటించారు.

ఎంపికైన జిల్లా జట్లు నవంబరు 9, 10వ తేదీల్లో విజయవాడలోని పీబీ సిద్దార్థ కాలేజీలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలియజేశారు. జేఎంజే కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ షైనీ కేపీ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

బాలుర జట్టు ఇదే..

పి.అమన్‌ఖాన్, ఎస్.అన్వేష్, ఆర్.అఖిల్, పి.కిరణ్‌బాబు (విజ్ఞాన్ కాలేజీ, వడ్లమూడి), డి.అనిల్, టి.నరసింహ (వాగ్దేవి జూనియర్ కాలేజీ, నరసరావుపేట), ఎస్.ధనుష్ (సీకే జూనియర్ కాలేజీ, మంగళగిరి), నాగుల్ షరీఫ్ (ఏపీఆర్‌జేసీ – ఉర్దూ, గుంటూరు), రాకేష్ (టీజేపీఎస్, గుంటూరు), శివగోపి (శ్రీచైతన్య, గుంటూరు), ఎంఆర్ విజయ్‌దీపక్ (శ్రీచైతన్య, బాపట్ల), కె.కార్తీక్ (అంబేద్కర్ కాలేజీ, తెనాలి). స్టాండ్ బైస్: ఎం.రూపస్, దానియేలు జీవజయన్, ఎస్.వినోద్ కుమార్.

బాలికల జట్టు..

వై.చంద్రిక, సీహెచ్ దుర్గాప్రసన్న, సి.మాధవి, వి.ఇందు (జేఎంజే కాలేజీ), ఎస్కే రేష్మ (ప్రగతి కాలేజీ, సత్తెనపల్లి), ఎ.హర్షిత (ఎస్‌ఆర్ కాలేజీ, గుంటూరు), బీఎస్ శ్రావ్య (జీజీసీ, గుంటూరు), వై.లావణ్య (వైష్ణవి జూనియర్ కాలేజీ, తెనాలి), ఎం.శ్రీలక్ష్మి (వాగ్దేవి జూనియర్ కాలేజీ, నరసరావుపేట), సీహెచ్ ధాన్యశ్రీ (శ్రీచైతన్య కాలేజీ, బాపట్ల), కె.వల్లిశ్రీ (అంబేద్కర్ గురుకులం, బాపట్ల), పి.తన్వి (జీఆర్‌సీఆర్‌కే, జడ్పీ హైస్కూలు, పెదకూరపాడు). స్టాండ్ బైస్: టి.అశ్విత, సీహెచ్ దీప్తి, పి.అనూష.

యంత్రాలతో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

- కూటమి పార్టీల నేతల ధనదాహానికి నిదర్శనం
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు



అరవింద వారధి వద్ద కృష్ణా నదిలో యంత్రం సాయంతో ట్రాక్టర్లలో ఇసుక లోడింగ్

కొల్లూరు : నదులలో యంత్రాలను ఉపయోగించి ఇసుక తవ్వకాలు చేపట్టరాదన్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను కూటమి ప్రభుత్వ నేతలు పక్కన పెట్టారు. రివర్ అండ్ కన్జర్వేషన్ (ఆర్‌సీ) నిబంధనల ప్రకారం నదులపై ఉన్న శాశ్వత కట్టడాలకు 500 మీటర్ల దూరంలో ఇసుక తవ్వకాలు చేపట్టరాదు. దీన్ని కూడా పచ్చ పార్టీ నేతలు అరవింద వారధి వద్ద పట్టించుకోవడం లేదు. కొల్లూరు మండలంలో కృష్ణా నదిలో యంత్రాలను ఉపయోగించి చేపడుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు వారి తీరుకు అద్దం పడుతున్నాయి. వేమూరు నియోజకవర్గ స్థాయి నేతకు చెందిన అనుయాయుల కనుసన్నల్లో ఈ తతంగం సాగుతోందని ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని గాజుల్లంక, పెసర్లంక–పెదలంక అరవింద వారధి ఆనుకొని కృష్ణా నదిలో ట్రాక్టర్లతో ఇసుక కొల్లూరు కరకట్ట దాటిస్తున్నారు. ఇసుకను దోనేపూడి సమీపంలోని పోతార్లంక ఎత్తిపోతల పథకం వద్ద కరకట్ట, కొల్లూరులోని మరో ప్రాంతంలో అన్‌లోడ్ చేస్తున్నారు. తర్వాత లారీల ద్వారా అక్రమ రవాణా చేస్తున్నారు. కృష్ణా నది మధ్యలో బాపట్ల, గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన 10 లంక గ్రామాలకు రాకపోకలకు అరవింద వారధి ఏకైక మార్గం. తవ్వకాలతో దీని మనుగడకు ముప్పు ఏర్పడింది. రెవెన్యూ, పోలీసు, ఆర్‌సీ అధికారులు నిబంధనలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా ఉండటంపై విమర్శలు వస్తున్నాయి. దీనిపై కొల్లూరు ఎస్‌ఐ జి. ఏడుకొండలు మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనలను మాత్రమే కఠినంగా అమలు చేయడానికే ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. నదిలో యంత్రాలను వినియోగించి ఇసుక తవ్వకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

10న రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రాధాకృష్ణమూర్తి, గురుదత్, శ్రీనివాస్, రాజేష్, ఉమాదేవి

గుంటూరు ఎడ్యుకేషన్: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రుద్ర కళాక్షేత్రం సహకారంతో నవంబర్ 10వ తేదీన 'బాల కళాప్రభ' పేరుతో రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు బాలానంద కేంద్ర అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం బ్రాడీపేటలోని బాలానంద కేంద్రంలో కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి వున్న సాంస్కృతిక కళా నైపుణ్యాలను వెలికితీయడానికి 1955లో బాలానంద కేంద్రాన్ని స్థాపించినట్లు తెలిపారు. వేల మందిని ఉత్తమంగా తీర్చిదిద్దామన్నారు. నవంబర్ 10న కృష్ణనగర్‌లోని లోటస్ ఆద్య పాఠశాలలో తెలుగు పద్యం, శాస్త్రీయ జానపద నృత్యాలు, చిత్రలేఖనం, సంస్కృత శ్లోకాలు, శాస్త్రీయ సంగీత (గాత్రం), జానపద, దేశభక్తి గీతాలు, వాద్య సంగీతం, కీబోర్డుల అంశాల్లో 3–6వ తరగతి వరకు జూనియర్స్, 7 – 10వ తరగతి వరకు సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పాఠశాలలకు సమాచారం పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. బాలల దినోత్సవం రోజున విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు నవంబర్ 8వ తేదీలోపు వాట్సాప్ నంబర్లు 91863 85890, 89199 81839కు పాల్గొనే విద్యార్థుల వివరాలు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి నడింపల్లి గురుదత్, సహాయ కార్యదర్శి బి.శ్రీనివాస్, మాచిరాజు రాజేష్, రుద్రకళాక్షేత్ర కార్యదర్శి పీఎస్‌ఆర్ కిరణ్, అకడమిక్ డైరెక్టర్ ఉమాదేవి పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

నగరంపాలెం: రౌడీషీటర్ మరణించినట్లు నకిలీ ధ్రువీకరణ పత్రం సృష్టించిన కానిస్టేబుల్‌పై వేటు పడింది. పశ్చిమ సబ్ డివిజన్ పరిధిలోని పట్టాభిపురం పీఎస్‌లో గతంలో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించిన రాజును సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు పాదర్తి రమేష్‌గాంధీ 2021లో మృతి చెందారు. గతంలో కృష్ణానగర్‌లో నివసించిన రౌడీషీటర్ పాదర్తి రమేష్‌పై కేసులు తొలగించేందుకు ఆయన మరణాన్ని ఉపయోగించుకుని పథకం రూపొందించాడు. ఈ క్రమంలో అతనిపై రౌడీషీట్ తొలగించేందుకు పాదర్తి రమేష్‌గాంధీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని కోర్టులో దాఖలు చేసిన విషయం విదితమే. దీంతో కానిస్టేబుల్ రాజును సస్పెండ్ చేశారు

సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలి

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని పలు విభాగాల్లోని పరిపాలన సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. పరిపాలన ఉద్యోగ, సిబ్బందికి విధులు మార్పు చేశారు. అనంతరం హాల్‌లో జరిగిన సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ఇంక్రిమెంట్లు, ఉద్యోగ విరమణ, మరణానంతర ప్రయోజనాలను సకాలంలో అందించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పెసర్లంక విద్యార్థిని



పెసర్లంక(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన కొక్కిలిగడ్డ నిహారిక ఎస్‌జీఎఫ్ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది. తద్వారా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ దాసరి వెంకట ప్రసాద్ మంగళవారం తెలిపారు. సిరిపురం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన అథ్లెటిక్స్ మీట్ అండర్–14 బాలికల విభాగంలో నిహారిక సత్తా చాటింది. ఈ సందర్భంగా నిహారికను హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్కే మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు ఐలవరం విద్యార్థి



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థి కె. అనిల్ కుమార్ డిసెంబర్‌లో అస్సాంలో జరగబోయే జాతీయ సీనియర్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. ఇటీవల అనంతపురం జిల్లా నార్పల శ్రీ నేతాజీ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ 43వ సీనియర్ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. వీటిలో అనిల్ కుమార్ ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. అనిల్ కుమార్‌ను, శిక్షణ ఇచ్చిన శ్రీనివాసరెడ్డిని ప్రధానోపాధ్యాయుడు ఎం. మోహన్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు జాబ్‌మేళాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు జిల్లాలోని నాలుగు చోట్ల జాబ్‌మేళాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఉపాధి అధికారి కె.రమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని మణిపురం ఫ్లై ఓవర్ దిగువన ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్, తుళ్లూరులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలోని నాక్ శిక్షణ కేంద్రం, చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తెనాలి ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలోని నాక్ శిక్షణ కేంద్రాల్లో మేళాలు ఉంటాయన్నారు.

ప్రాచీన క్రీడలను కాపాడుకోవాలి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): సిలంబం (కర్రసాము) లాంటి ప్రాచీన క్రీడలను కాపాడుకోవడమే కాకుండా నేటి యువతరానికి నేర్పాలని శాప్ చైర్మన్ రవి నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన ఈ నెల 27న సిలంబం స్టిక్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లోని విజేతలను అభినందించారు. రాష్ట్ర కార్యదర్శి డీఎస్ క్రిస్టోఫర్‌ను మెచ్చుకున్నారు. క్రీడా సంఘాలు క్రమం తప్పకుండా పోటీలు నిర్వహించాలని సూచించారు.

రైల్వే స్టేషనులో వసతుల పరిశీలన

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గుంటూరు రైల్వే స్టేషన్‌లో దీపావళి రద్దీని పురస్కరించుకుని ప్రయాణికులకు సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. డీఆర్‌ఎం రామకృష్ణ ఉత్తర్వుల మేరకు తగిన ఏర్పాట్లు చేశామని డీసీఎం కమలాకర్ బాబు అన్నారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఆయన వసతులను పరిశీలించారు. ప్రయాణికులకు సమాచార కేంద్రం, రిజర్వేషన్ కౌంటర్లు, అనౌన్స్‌మెంట్ విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రయాణికుల ఫిర్యాదుల పరిష్కారానికి ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో డివిజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళిత రైతు మరణానికి కారకులను శిక్షించాలి



మాట్లాడుతున్న సమితి అధ్యక్షుడు నాగేంద్రరావు

అద్దంకి రూరల్: దళిత రైతు బలవర్మరణానికి కారకులైన వారికి తక్షణమే అరెస్ట్ చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో విలేకర్ల సమావేశంలో నాగేంద్రరావు మాట్లాడుతూ బల్లికురవ మండలం జమ్మలమడుగు గ్రామానికి చెందిన చింతల శ్రీనుకి వారసత్వంగా వచ్చిన భూమిని అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. చింతల శ్రీను అనేకసార్లు బల్లికురవ తహసీల్దార్‌కు, బాపట్ల కలెక్టరేట్ చుట్టూ తిరిగాడన్నారు. ఆక్రమణదారుల్ని హక్కు పత్రాలు తేవాలని అధికారులు ఆదేశించినా అప్పుడు తేలేకపోయారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వెంటనే భూమికి సంబంధించిన పత్రాలు ఆర్డీవో ముందు ఉంచారన్నారు. దానికి తోడు బల్లికురవ పోలీసు స్టేషన్‌కు పిలిపించి శ్రీనును భూమి వైపు వెళితే కేసులు పెడతామని బెదిరించారన్నారు. ఈ క్రమంలో 21వ తేదీన తన మరణానికి కారకులైన వారి పేర్లు చెప్పి సెల్ఫీ తీసుకున్నారని గుర్తుచేశారు. శ్రీను ఆరోపించిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని, బాధిత కుటుంబానికి రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బహుజన గిరిజన రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు, అద్దంకి నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు అంకం కిరణ్ కుమార్, కాకుమాను రవి, పులి వికాస్, అక్కయ్య, వెంకటేశ్వర్లు, మోగియ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కొత్తపేట విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

వేటపాలెం: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కొత్తపేట విద్యార్థులు ఎంపికయ్యారు. మండలంలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జీ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. అండర్–17 బాలుర విభాగంలో బేస్‌బాల్ పోటీలకు కె. ఏసోబు, డీ ప్రసాద్, అండర్–17 బాలికల విభాగంలో ఎస్. శ్రావణి, అండర్–14 బాలకల విభాగంలో ఎన్. జయచంద్రిక, ఈ వెంకాయమ్మ, అండర్–14 విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో ఎం. రేఖ ఎంపికై నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు గవిని నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ విక్టోరియా, పీడీ సీతాదేవి, హనుమంతరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

చెస్ పోటీలలో విజేతలకు బహుమతులు



విజేతలతో నిర్వాహకులు, ఉపాధ్యాయులు

చుండూరు(వేమూరు): జాతీయ స్థాయి చెస్ పోటీలకు పలువురు బాలబాలికలు ఎంపికయ్యారు. బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. పురుషోత్తం ఈ మేరకు వివరాలు తెలిపారు. వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండలం యడ్లపల్లి ఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చెస్ పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు పంపిణీ చేశారు. అంతర్ జిల్లా పోటీల్లో బాలుర విభాగంలో తూర్పు గోదావరికి చెందిన అల్లూరు భాస్కర్, రత్న షణ్ముఖరెడ్డి, కృష్ణా జిల్లాకు చెందిన తాళ్ల నిల్సన్, కర్నూల్‌కు చెందిన వి.హర్షవర్ధన్, తూర్పు గోదావరికి చెందిన కనపర్తి సీతాసాగర్, వైజాగ్‌కు చెందిన వెంపరాల వెంకటేశ్వరరావు, బాలికల విభాగంలో నెల్లూరుకు చెందిన గడ్డెటి హిమ తేజశ్విని, నెల్లూరుకు చెందిన వేముల ప్రద్యుమ్నలక్ష్మి, గుంటూరుకు చెందిన ఆమంచి నాగ శివసాయి దివ్య, అనంతపురానికి చెందిన జి. శిరీష, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సోనాలిశ్రమణి కార్తీక్ కన్నా విజేతలుగా నిలిచారని ఆయన తెలిపారు. వీరు నవంబరులో మధ్యప్రదేశ్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్రా శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ రావి సాయిబాబా, మండల విద్యాశాఖాధికారి చలపతిరావు, సాల్మాన్, చెస్ పోటీల అబ్జర్వర్ భాను ప్రకాశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వేమూరి శరత్ బాబు పాల్గొన్నారు.

స్తంభంపైనే ప్రాణాలు విడిచిన ఎలక్ట్రీషియన్



విద్యుత్ స్తంభంపై డానియేల్ మృతదేహం

వేటపాలెం: స్తంభం ఎక్కి వీధిలైట్లు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతంతో కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందాడు. ఈ విషాద ఘటన మంగళవారం మండలంలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ వివేకానంద కాలనీలో జరిగింది. అందిన వివరాల మేరకు.. చల్లారెడ్డిపాలెం స్థానిక జబ్బార్ కాలనీకి చెందిన ఎస్ డానియేల్ (35) పంచాయతీ కాంట్రాక్టు కార్మికుడిగా పదేళ్లుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వివేకానంద కాలనీలో వీధిలైట్లు మరమ్మతుల కోసం డానియేల్ విద్యుత్ స్తంభాన్ని ఎక్కాడు. విద్యుత్ సరఫరా కావడంతో డానియేల్ షాక్‌కు గురై అక్కడికక్కడే స్తంభం మీదే ప్రాణాలు విడిచాడు. అంతకుముందు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా నిలిపి, మరమ్మతులు చేయడానికి వచ్చాడని స్థానికులు తెలిపారు. రిపేరు చేసే సమయంలో వైర్లకు విద్యుత్ సరఫరా ఏవిధంగా వచ్చిందో తేలాల్సి ఉంది. స్థానికులు జేసీబీతో పోల్‌పై ఉన్న మృతదేహాన్ని కిందికి దించి పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. డానియేల్‌కు ఐదేళ్ల క్రితం వివాహమైంది. భార్య, మూడేళ్ల కుమారుడు, ఏడాదిన్నర బాబు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న భార్య.. స్తంభంపై విగత జీవిగా ఉన్న డానియేల్‌ను చూసి స్పృహ కోల్పోయింది. ఎస్సై ఎం.వెంకటేశ్వర్లు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృత్యువాత



బ్రహ్మయ్య (ఫైల్)

అద్దంకి రూరల్: బైకును కంటైనర్ లారీ ఢీకొట్టటంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై ఖాదర్‌బాషా కథనం మేరకు.. అద్దంకి మండలం విప్పర్లవారిపాలేనికి చెందిన బొనిగల బ్రహ్మయ్య (38) తాపీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం బ్యాంకులో డబ్బులు తీసుకునేందుకు అద్దంకి వచ్చాడు. తిరిగి గ్రామానికి మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ హైవేపై బైకుపై వెళుతున్నాడు. మార్గమధ్యలో బలరామకృష్ణపురం సమీపంలోకి రాగానే వెనుకనుంచి వేగంగా కంటైనర్ లారీ బైకును ఢీకొట్టింది. ద్విచక్ర వాహనాన్ని కొంతదూరం ఈడ్చుకెళ్లింది. బైకు మీదనున్న బ్రహ్మయ్య తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బ్రహ్మయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి మృతి చెందటంతో భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.

వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు నమోదు

- హైకోర్టులో ఊరట
- రెండు వారాలపాటు చర్యలు తీసుకోవద్దంటూ ఆదేశాలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ రూరల్ వైఎస్సార్ సీపీ నాయకులపై పోలీసులు టీడీపీ వారి ప్రోత్సాహంతో అక్రమ కేసులు బనాయించారు. ఆ కేసులలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, గుంటూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకటరెడ్డి, తాడేపల్లి రూరల్‌కు చెందిన జక్కిరెడ్డి వెంకటకృష్ణారెడ్డిలతో పాటు పలువురు నాయకులకు హైకోర్టు రెండు వారాల పాటు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. అప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు ఆదేశించింది. అక్రమ కేసుల్లో ఇబ్బందులకు గురి అవుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ... టీడీపీ నాయకులకు తమను రాజకీయంగా ఎలా ఎదుర్కోవాలో అర్థం కాక ఇలా అక్రమ కేసులు బనాయిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ కార్యకర్తల రౌడీయిజం వల్ల కుంచనపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటరెడ్డి మృతి చెందారని తెలిపారు. అప్పట్లో పోలీసులు జరిగిన సంఘటనపై పొరపాటున కాదు, ఉద్దేశపూర్వకంగా రెచ్చగొడుతూ వెంకటరెడ్డిని ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతో మృతి చెందారని కేసు నమోదు చేశారని గుర్తుచేశారు. ఆ కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్న వ్యక్తి బెయిల్‌పై వచ్చిన 6 నెలల తరువాత ఎలాంటి ఆధారాలు లేకుండా తమపై అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. ఈ కేసులపై కోర్టులో న్యాయపోరాటం చేస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు.

కార్మికులపై వేధింపులు ఆపకుంటే ఉద్యమం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న ఫ్యాక్టరీ కార్మికులు, సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులపై అధికారుల వేధింపులు ఇలాగే కొనసాగితే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. మంగళవారం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పాశం రామారావు కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులను, యూనియన్ నాయకులు కూరపాటి స్టీఫెన్, ఎస్కే బాషా, వై. సుబ్బారావు, సూర్య ప్రకాష్, వెంకటరత్నం, ఆశీర్వాదం తదితరులను ఫ్యాక్టరీ స్థలం దగ్గరకు వచ్చి పోలీసులు తీసుకువెళ్లి ఎమ్మార్వో కార్యాలయం ముందు బైండ్ ఓవర్ చేయడంతో కార్మికులు భయభ్రాంతులకు గురి అయ్యారని అన్నారు. కార్మికులకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులు వేధింపులు ఆపాలని, కోర్టు తీర్పులను ధిక్కరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, పోలీసు అధికారులు చేస్తున్న ఈ దుర్మార్గమైన చర్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సమస్యను పరిష్కరించకపోగా అక్రమ అరెస్టులకు దిగడం సరికాదని, ఇప్పటికైనా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు న్యాయంగా రావాల్సిన బకాయిలు చెల్లించకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. న్యాయమైన ఈ పోరాటానికి అన్ని ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రూరల్ పట్టణ కార్యదర్శులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరగ వెంకటేశ్వర్లు, సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఏఐఎఫ్‌టీయూ నాయకులు కోటేశ్వరరావు, సుబ్బారావు, అప్పారావు, సాంబయ్య, రమాదేవి, నవనీతం, జానీ, బాష, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.